సాక్షి
అనంతపురం

ఆదివారం । 18 । జూన్ । 2023



టన్ను చీనీ రూ.40 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం టన్ను చీనీకాయలు గరిష్ట ధర రూ.40 వేలు పలికాయి.



దంపతుల దుర్మరణం

పెన్నహోబిలం వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులు దుర్మరణం చెందారు. ఇద్దరు పిల్లలు గాయపడ్డారు. 8లో

గరిష్టం/కనిష్టం
38.5°/23.8°

జిల్లా అంతటా శనివారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. గాలివేగం స్వల్పంగా పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడ్డాయి.

న్యూస్‌రీల్

నేరస్తులకు శిక్ష పడాలి



మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: నేరస్తులకు శిక్షపడేలా పనిచేయాలని ఎస్పీ కె.శ్రీనివాసరావు పోలీసు అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్‌హాలులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని పోలీసు అధికారులు, ఏపీపీలు, కోర్టు కానిస్టేబుళ్లు సమన్వయంతో పని చేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. నేరం చేసిన వారికి శిక్షపడితే తప్పు చేయాలన్న ఆలోచన ఇంకెవ్వరికీ రాదన్నారు. పైగా పోలీసులంటే ప్రజలకు భరోసా కలుగుతుందన్నారు. నేరగాళ్లలో భయం పుట్టాలంటే నేరస్థలిలో సరైన ఆధారాలను సేకరించి.. న్యాయస్థానం నుంచి తప్పించుకోకుండా గట్టిగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఆర్.రామిరెడ్డి, రామకృష్ణ, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ రాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

'నైరుతి'లో కదలిక



అనంతపురం అగ్రికల్చర్: బిపోర్‌జాయ్ తుపాను ప్రభావం తగ్గిపోవడంతో నైరుతి రుతుపవనాల్లో కదలిక వస్తోంది. ఈ నెల 19 నుంచి రుతుపవనాలు విస్తరించి వర్షాలు పడే సూచనలు ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త సహదేవరెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త అశోక్‌కుమార్ తెలిపారు. ఈ నెల 22 వరకు వర్షపాతం నమోదు కావొచ్చని పేర్కొన్నారు.

ఎకాలజీ సెంటరుకు జలశక్తి అవార్డు



కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ నుంచి అవార్డు తీసుకుంటున్న మల్లారెడ్డి

అనంతపురం: కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ అనంతపురంలోని యాక్షన్ ఫెటర్నా ఎకాలజీ సెంటరుకు 4వ జాతీయ జల అవార్డును ప్రకటించింది. జల వనరుల అభివృద్ధి, నిర్వహణకు విశేష కృషి చేస్తున్న సంస్థలకు వివిధ కేటగిరీల కింద నేషనల్ వాటర్ అవార్డులు ప్రదానం చేస్తున్నారు. జిల్లాలో జల వనరుల అభివృద్ధి, మెట్ట వ్యవసాయంలో కరువు నుంచి రక్షించడానికి ఫారంపాండ్లు, రక్షక తడి, మిశ్రమ పంటలు, అంతర పంటలు మొదలైనవి విస్తృతంగా అమలు చేస్తూ విశేష కృషి చేసినందుకు యాక్షన్ ఫెటర్నాకు ప్రత్యేక అవార్డు ప్రకటించారు. ఈ అవార్డును ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డాక్టర్ వైవీ మల్లారెడ్డికి ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్, కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ చేతుల మీదుగా శనివారం ఢిల్లీలో అందజేశారు.

ఈవ్‌టీజర్ల భరతం పట్టండి



స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న డీఐజీ అమ్మిరెడ్డి

అనంతపురం శ్రీకంఠం సర్కిల్: నగరంలో ఈవ్‌టీజర్ల భరతం పట్టాలని డీఐజీ అమ్మిరెడ్డి 'దిశ' పోలీసులను ఆదేశించారు. దిశ పోలీసు స్టేషన్‌ను డీఐజీ శనివారం రాత్రి తనిఖీ చేశారు. షీటీమ్స్ చురుగ్గా పనిచేయాలన్నారు. ఫ్యామిలీ కౌన్సెలింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. బాధలను క్షుణ్ణంగా విని పరిష్కారం చూపాలన్నారు.

చదువే విలువైన ఆస్తి

- విద్యారంగానికి సీఎం జగన్ అధిక ప్రాధాన్యత
- కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు
- విద్యార్థులు బాగా చదివి ఉన్నతస్థానాలకు చేరుకోవాలి
- జగనన్న ఆణిముత్యాల జిల్లాస్థాయి కార్యక్రమంలో మంత్రి ఉషశ్రీచరణ్



జిల్లాస్థాయి 'జగనన్న ఆణిముత్యాలు' కింద రూ.48.26 లక్షల మెగాచెక్కును అందిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్, కలెక్టర్ గౌతమి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

అనంతపురం క్రైం: అన్నిటికన్నా విలువైన ఆస్తి చదువే అని, అందుకే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యారంగానికి అధిక ప్రాధాన్యతనిచ్చారని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కె.వి.ఉషశ్రీ చరణ్ తెలిపారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా వంద శాతం అమ్మాయిలు పాఠశాలలకు వచ్చేలా చర్యలు తీసుకున్న ఏకైక రాష్ట్రం ఏపీనేనన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పదో తరగతి, ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు శనివారం అనంతపురంలోని కేఎస్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో జిల్లా స్థాయి 'జగనన్న ఆణిముత్యాలు' పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. పదో తరగతిలో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన ఏడుగురు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.50వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన ఎనిమిది మందికి ఒక్కొక్కరికి రూ.30వేలు, తృతీయ స్థానంలో నిలిచిన ఎనిమిది మందికి ఒక్కొక్కరికి రూ.15వేల చొప్పున, ఇంటర్మీడియెట్‌లో 18 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.50వేల చొప్పున నగదు పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రతిభా పురస్కారాలకు సంబంధించిన రూ.48,26,000 మెగా చెక్కును మంత్రి ఉషశ్రీ చరణ్, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, కలెక్టర్ గౌతమి విద్యార్థులకు అందజేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రధానోపాధ్యాయులను సన్మానించారు. ముఖ్య అతిథి మంత్రి మాట్లాడుతూ పిల్లల చదువు తల్లిదండ్రులకు ఆర్థికభారం కాకూడదని 'అమ్మ ఒడి' పథకం ద్వారా సాయం అందిస్తున్నట్లు తెలిపారు. నాడు–నేడు కార్యక్రమం కింద ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరచి కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా తీర్చిదిద్దినట్లు చెప్పారు. బడి తెరిచిన తొలిరోజే పుస్తకాలు, యూనిఫాం, షూ తదితర విద్యా సామగ్రి అందజేసి, విద్యార్థులు ఆహ్లాదకర వాతావరణంలో చదువుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. చంద్రబాబు హయాంలో స్కూళ్లను మూసివేస్తే.. జగనన్న సర్కారు బడులు మూసివేయకుండా సౌకర్యాలు కల్పించి.. అభివృద్ధి చేసిందని కొనియాడారు. జిల్లాలో విద్యాభివృద్ధికి దాదాపు రూ.2వేల కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. ఇందులో 'గోరుముద్ద' పథకం ద్వారా జిల్లాలో రూ.74.02 కోట్లు వెచ్చించిందన్నారు. మన బడి 'నాడు–నేడు' పథకం ద్వారా జిల్లాలో రూ.280.57కోట్లు, జగనన్న విద్యా కానుక ద్వారా ఇప్పటి వరకు రూ.118.94 కోట్లు, అమ్మఒడి పథకం ద్వారా రూ.1441.47 కోట్లు వ్యయం చేసినట్లు వివరించారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నతస్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహ్మద్, మేయర్ వసీం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు జగనన్న ప్రభుత్వం పూర్వ వైభవం తీసుకొచ్చిందన్నారు. మౌలిక సదుపాయాలు కల్పించి, బోధనా ప్రమాణాలు పెంచి ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేస్తోందన్నారు. జూన్ మాసం వచ్చిందంటే పిల్లల చదువుల కోసం డబ్బు వెతుక్కోవాల్సి వస్తుందని తల్లిదండ్రులు భయపడేవారని గుర్తు చేశారు. అమ్మ ఒడి పథకం కింద రూ.15వేల సాయంతో పాటు జగనన్న విద్యా కానుక ద్వారా రూ.2,400 విలువ చేసే విద్యా సామగ్రి ఉచితంగా ఇవ్వడంతో తల్లిదండ్రులకు ఆర్థిక ఉపశమనం కల్పించారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మంగమ్మ, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, డీఈఓ సాయిరాం, ఆర్డీఓ మధుసూదన్, రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, రాష్ట్ర నాటక అకాడమీ చైర్‌పర్సన్ హరిత, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఉమాదేవి, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి పాల్గొన్నారు.

ఉత్తీర్ణత మరింత మెరుగుపడాలి

పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం మెరుగుపడాల్సిన అవసరం ఉందని కలెక్టర్ గౌతమి పేర్కొన్నారు. గతేడాది 49.70 శాతం ఉన్న టెన్త్ ఉత్తీర్ణత శాతం ఈ ఏడాది 66.25కు చేరిందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని వచ్చే ఏడాది ఉత్తీర్ణత శాతం మరింత పెరగాలని ఉపాధ్యాయులు, విద్యాశాఖాధికారులకు కలెక్టర్ గౌతమి ఆదేశించారు. అంతర్జాతీయ ప్రమాణాలు అందుకునే విధంగా ప్రభుత్వం మంచి ఆశయంతో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టిందని, డిజిటల్ బోధన తదితర మౌలిక సదుపాయాల కల్పనకు రూ.కోట్లు వెచ్చిస్తోందని అన్నారు. 'జగనన్న ఆణిముత్యాలు' కార్యక్రమం విద్యార్థులకు వరమని, ఈ నెల 20న సీఎం చేతుల మీదుగా ప్రస్తుతం అవార్డులు పొందిన విద్యార్థులకు మరోసారి పురస్కారాలు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు.



కార్యక్రమానికి హాజరైన ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు

టెన్త్‌లో జగనన్న ఆణిముత్యాలు వీరే..

జిల్లాస్థాయిలో ప్రథమ స్థానం:
సాయి అక్షయ్ (అనంతపురం), పవన్‌కిషోర్ (ఉరవకొండ), కమ్మర లక్ష్మి (పెదవడుగూరు), మధుగొండె వెంకటేష్ (రాయదుర్గం), కండ్లపల్లి హాసిని (గుత్తి), దేవశంకట్టి మధుసూదన్ (బీ పప్పూరు, నార్పల), డుంగావత్ గురునాయక్ (గుత్తి).

ద్వితీయ స్థానం :
కరణం రక్షిత (కుందుర్పి), శశాంక్ (ఉరవకొండ), గీత, వసంతబాయి (అనంతపురం), లోకేశ్వరి (యల్లనూరు), పావని, హమీద నస్రిన్, అంజలి (గుత్తి).

తృతీయ స్థానం :
గణేష్ ప్రమద మణి (అనంతపురం), అర్చన, భూమిక (గుమ్మఘట్ట), పల్లవి (నార్పల), జగదీష్ (రాయదుర్గం), ప్రతీక్ష (గుత్తి), నిర్మల (బ్రహ్మసముద్రం), కీర్తనబాయి(అనంతపురం)

- వీరితోపాటు ఇంటర్‌లో 18 మంది జిల్లాస్థాయి 'జగనన్న ఆణిముత్యాలు' కింద పురస్కారాలు అందుకున్నారు.

చాలా సంతోషంగా ఉంది



ప్రభుత్వ పాఠశాలల్లో చదివి పరీక్షల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు 'జగనన్న ఆణిముత్యాలు' పేరిట ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి పురస్కారాలు అందజేయడంతో పాటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులనూ సన్మానించడం చాలా సంతోషంగా ఉంది. మా పాఠశాల ఉపాధ్యాయుల పర్యవేక్షణ, తల్లిదండ్రుల సూచనలు, సలహాలతో పదో తరగతి పరీక్షల్లో జిల్లా టాపర్‌గా నిలిచా.

– సాయి అక్షయ్ కడియాల, పొట్టిశ్రీరాములు స్కూల్, అనంతపురం

మరచిపోలేని అనుభూతి



చదువులో ప్రతిభ చూపిన వారిని ప్రోత్సహించేందుకు 'జగనన్న ఆణిముత్యాలు' కార్యక్రమం ఏర్పాటు చేయడం గొప్ప విషయం. ప్రభుత్వం అందించే అవకాశాలను అందిపుచ్చుకోవాలి. ఇంటర్‌లో 969/1000 మార్కులు సాధించా. ఆణిముత్యాలు పురస్కారం అందుకోవడం మరచిపోలేని అనుభూతినిస్తోంది. ఇదే స్ఫూర్తితో మున్ముందు మరిన్ని విజయాలు సాధిస్తా.

–శిల్ప, కేఎస్ఆర్ జూనియర్ కళాశాల, అనంతపురం

నకిలీ డాక్యుమెంట్లతో కిరికిరి

- బహుళ రిజిస్ట్రేషన్లతో కొనుగోలుదారుల ఆందోళన
- భూములు, స్థలాలు కబ్జా చేయడమే కాక బెదిరింపులు
- 'స్పందన', 'జగనన్నకు చెబుదాం'లో వెల్లువెత్తుతున్న అర్జీలు
- న్యాయం జరగక బలవన్మరణాలకు పాల్పడుతున్న బాధితులు




- బుక్కరాయసముద్రంలో నాలుగు నెలల క్రితం దేవరకొండ పైనుంచి ఓ కారు కిందకు పడింది. పోలీసులు ఆరా తీస్తే స్థలం వివాదం నేపథ్యంలో ఓ స్కూలు యజమాని ఆ కారులో ఆత్మహత్య చేసుకున్నట్లు తేలింది.
- అనంతపురంలో తుమ్మల వంశీ అనే వ్యక్తి శుక్రవారం తన ఇంట్లోనే ఉరి వేసుకున్నాడు. రూరల్ పరిధిలో తాను కొనుగోలు చేసిన భూమిని కొందరు కబ్జా చేసి, బెదిరింపులకు దిగడంతో మనస్తాపం చెంది చనిపోతున్నట్లు సూసైడ్ నోట్‌లో పేర్కొన్నాడు. పోలీస్ స్టేషన్‌కు వెళ్లినా ఫలితం లేదని అందులో తెలిపాడు.
- అనంతపురంలోని రాజు రోడ్డులో గల షాపును ఓ వ్యక్తి కొనుగోలు చేసి, రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. తర్వాత అమ్మిన వారికే అద్దెకు ఇచ్చాడు. నాలుగు నెలల తర్వాత అద్దె అడగ్గా.. నా చెల్లెలు మైనర్ అని, ఆమెకూ వాటా ఉందని కోర్టులో కేసు వేశారు. దీంతో ఈ కేసునుంచి బయటపడేందుకు కొనుగోలు చేసిన వ్యక్తి పడిన కష్టాలు అన్నీ ఇన్నీ కావు.

సాక్షి ప్రతినిధి, అనంతపురం: అనంతపురం శివారు ప్రాంతాల్లో భూములు, స్థల వివాదాల కేసులు భారీగా పెరిగిపోయాయి. ఖాళీ స్థలాలు కనిపిస్తే చాలు కొంతమంది నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి.. అందులో పాగా వేసేస్తున్నారు. హక్కుదారులు నాలుగు నెలలు విరామం ఇచ్చి ఊరు వెళ్లి వచ్చేలోపే అక్కడ కొంతమంది షెడ్లు వేస్తున్నారు. తాత్కాలిక నిర్మాణాలు చూసి యజమానులు నివ్వెరపోతున్నారు. వాటిని తొలగించడానికి వెళ్తే 'ఇది మాదంటూ' ఫోర్జరీ డాక్యుమెంట్లు చూపిస్తున్నారు. బాధితులు న్యాయం కోసం 'స్పందన'కు వెళ్లి అర్జీలు ఇవ్వడం, పోలీస్‌స్టేషన్లను ఆశ్రయించడం నిత్యకృత్యమైంది.

నకిలీ డాక్యుమెంట్లతో కోర్టులో దావా..

కబ్జాదారులు సరికొత్త వ్యూహాన్ని అనుసరిస్తున్నారు. నకిలీ డాక్యుమెంట్లు సృష్టించడం, వెంటనే సివిల్ కోర్టులో దావా వేయడం చేస్తున్నారు. దీనివల్ల రెవెన్యూ అధికారులు గానీ, పోలీసులు గానీ జోక్యం చేసుకోలేకపోతున్నారు. కొన్నిసార్లు క్షేత్రస్థాయిలో పోలీసులు కూడా కబ్జాదారులపై ఫిర్యాదు రాగానే స్పందించకపోవడంతో వివాదాలు జటిలమవుతున్నట్టు విమర్శలున్నాయి. అనంతపురం పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోనూ భూ వివాదాల కేసులు ఇబ్బడి ముబ్బడిగా నమోదవుతున్నాయి. కొంతమంది చిల్లర రౌడీలు బెదిరింపులకు దిగడంతో బాధితులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు.


'స్పందన'లో ప్రత్యేక లీగల్ సెల్



మా దగ్గరకు వచ్చేసరికే సివిల్ కోర్టులో కేసులు ఫైల్ అయి ఉంటాయి. సివిల్ కోర్టులో ఆర్డర్ వచ్చాక మేము జోక్యం చేసుకోలేం. కోర్టు కేసులు లేనివైతే ఓనర్ ఎవరో రికార్డులు పరిశీలించి వారికి తక్షణమే రిజిస్ట్రేషన్ అయ్యేలా ఆర్డర్ ఇవ్వాలని తహసీల్దార్లకు చెప్పాం. తాజాగా 'స్పందన'లోనూ ప్రత్యేక లీగల్ సెల్ ఏర్పాటు చేసి కోర్టు కేసులను ఎలా పరిష్కరించుకోవాలో అడ్వకేట్‌ను నియమించి వారికి సూచనలు ఇస్తున్నాం. నిన్న జరిగిన తుమ్మల వంశీ కేసు కూడా సివిల్ కోర్టులో ఉండటం వల్ల మేము జోక్యం చేసుకోలేదు.

– కేతన్ గార్గ్, జాయింట్ కలెక్టర్

కోర్టు పరిధిలో లేకపోతే తక్షణ పరిష్కారం



రిజిస్ట్రేషన్ అయ్యాక భూమి అప్పగించకపోవడం, లేదా అడ్వాన్సు రూపంలో డబ్బు తీసుకుని రిజిస్ట్రేషన్‌కు సహకరించకపోవడం వంటి కేసుల్లో తక్షణమే పిలిపించి న్యాయం చేస్తున్నాం. మా దగ్గరకు వస్తున్న కేసుల్లో ఎక్కువగా బహుళ రిజిస్ట్రేషన్లు ఉన్నవే ఎక్కువ. కోర్టు పరిధిలో ఉన్న కేసుల విషయంలో మేమేమీ చేయలేమని బాధితులకు చెబుతున్నాం.

–కె.శ్రీనివాసరావు, ఎస్పీ

చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెంచాలి



మాట్లాడుతున్న డీఏఓ ఉమామహేశ్వరమ్మ

ఉరవకొండ: చిరుధాన్యాల పంటల సాగు విస్తీర్ణం పెంచేలా వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) ఉమామహేశ్వరమ్మ సూచించారు. శనివారం ఉరవకొండలోని లయన్స్ క్లబ్ కార్యాలయంలో చిరుధాన్యాల సాగుపై సిబ్బందితో సమీక్ష, శిక్షణ కార్యక్రమాన్ని డీఏఓ ప్రారంభించి మాట్లాడారు. చిరుధాన్యాలకు ప్రభుత్వం మద్దతు ధర కల్పిస్తోందని, అందులో రాగులు క్వింటాలుకు రూ.3,840, జొన్నలు రూ.3,240 చొప్పున రైతుల నుంచి సేకరిస్తున్నామని తెలిపారు. రైతులకు విత్తనాలు, ఎరువులను ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉంచేలా చూడాలన్నారు. యాంత్రీకరణ పథకం ద్వారా అర్హులైన రైతులకు పరికరాలు అందించాలన్నారు. కౌలు రైతులకు కౌలు పత్రాలు అందించి వారికి ప్రభుత్వ సబ్సిడీ పథకాలు అందేలా చూడాలన్నారు. పీఎం కిసాన్, రైతు భరోసాకు అర్హత సాధించాలంటే రైతులు ఎన్‌పీసీఎం మ్యాపింగ్ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీఏ పద్మజ, ఉరవకొండ, విడపనకల్లు, వజ్రకరూరు, గుంతకల్లు ఏఓలు శుభకర్, మధుకర్, పెన్నయ్య, స్వాతి, నాలుగు మండలాల ఆర్‌బీకె సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరు తహసీల్దార్లకు పోస్టింగ్

అనంతపురం అర్బన్: తహసీల్దార్లుగా ఉద్యోగోన్నతి పొందిన ఇద్దరికి కలెక్టర్ గౌతమి శనివారం మండలాలు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల ముగ్గురు డీటీలు తహసీల్దార్లుగా పదోన్నతి పొందారు. వీరిలో ఎస్.సైపుల్ హక్ డీటీగానే వీఆర్ఎస్ తీసుకున్నారు. ఇక డి.ఓబులేసును బెళుగుప్ప తహసీల్దారుగా, పి.శేషారెడ్డిని కూడేరు తహసీల్దారుగా నియమించారు. ఇదిలా ఉండగా శ్రీసత్యసాయి జిల్లా నుంచి తహసీల్దారు బాలాజీరావు పరస్పర బదిలీపై అనంతపురం వస్తున్నారు. ఇక్కడి నుంచి తహసీల్దారు వేణుగోపాల్‌రావు అక్కడికి వెళ్తున్నారు. కలెక్టర్ వద్ద బాలాజీరావు రిపోర్టు చేసుకున్న తరువాత పోస్టింగ్ ఇస్తారు.

క్లుప్తంగా

'ఏపీపీ సెట్' ఆర్ట్స్ కళాశాల విద్యార్థిని సత్తా



లక్ష్మీదేవిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ దివాకర్‌రెడ్డి

రాప్తాడురూరల్: ఏపీ వ్యాయామ ప్రవేశ పరీక్ష–2023 (ఏపీపీ సెట్)లో అనంతపురం ఆర్ట్స్ కళాశాలలో బీకాం చివరి సంవత్సరం చదువుతున్న లక్ష్మీదేవి రాష్ట్రస్థాయి రెండోర్యాంకు సాధించింది. ఆమెను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దివాకర్ రెడ్డి, ఏఓ వెంకట రమణ, వ్యాయామ అధ్యాపకులు జబీవుల్లా, జయ రామప్ప, శ్రీరామ్ శనివారం సన్మానించారు.

తాడిపత్రిలో దారుణం

- తాగొద్దని మందలించిన దంపతులపై పెట్రోల్ చల్లి నిప్పు
- మహిళ పరిస్థితి విషమం



తీవ్రంగా గాయపడిన సరస్వతి



చికిత్స పొందుతున్న పూజిత

తాడిపత్రి: తాడిపత్రిలో దారుణం చోటుచేసుకుంది. మద్యానికి బానిసైన ఓ వ్యక్తి తాగొద్దని మందలించిన దంపతులపై పెట్రోల్ పోసి నిప్పు పెట్టాడు. ఈ ఘటన చుక్కలూరు పారిశ్రామికవాడలో చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు.. పారిశ్రామిక వాడలోని శ్రీనిధి నల్ల బండల పాలిష్ పరిశ్రమలో నల్లపురెడ్డి, సరస్వతి దంపతులు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. శనివారం రాత్రి పరిశ్రమ ఆవరణలో మంచంపై నిద్రిస్తున్నారు. అదే ఫ్యాక్టరీలో పని చేసే మల్లికార్జున కుమార్తె పూజిత కూడా వీరి పక్కనే మంచం వేసుకుని నిద్రిస్తోంది. రాత్రి 11.30 గంటల సమయంలో సరస్వతి మరిది రామేశ్వర్‌రెడ్డి నిద్రిస్తున్న నల్లపురెడ్డి, సరస్వతిపై పెట్రోల్ పోశాడు. మెలకువ వచ్చిన సరస్వతి ఏం చేస్తున్నావురా అని అరిచేలోగానే నిప్పంటించాడు. దీంతో వారు తీవ్రంగా గాయపడ్డారు. పక్కనే నిద్రిస్తున్న పూజితకు కూడా మంటలు అంటుకుని చేతులు కాలాయి. తాగుడుకు బానిసైన రామేశ్వర్‌రెడ్డిని రెండు రోజుల క్రితం తాము పద్ధతి మార్చుకోవాలని దండించామని, అది మనసులో ఉంచుకుని ఇలా చేశాడని నల్లపురెడ్డి, సరస్వతి దంపతులు రూరల్ ఎస్‌ఐ గౌస్ మహ్మద్‌కు వివరించారు. వారి ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్‌ఐ కేసు నమోదు చేసుకున్నారు. సరస్వతి, నల్లపురెడ్డి పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురం సర్వజనాస్పత్రికి తరలించారు. పూజితకు తాడిపత్రి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు.



మారుతున్న కాలానికి మార్గదర్శి

సందర్భం
నేడు ఫాదర్స్ డే

సహనానికి మారుపేరు నాన్న.. భావితరం మార్పుకి మార్గదర్శి. పిల్లల్ని నవమాసాలు మోసేది అమ్మ అయితే.. పుట్టిన తర్వాత తన గుండెలపై మోసేవాడు నాన్న అంటారు పెద్దలు. ఏది కోరినా చిటికెలో తెచ్చిస్తాడు. కుటుంబం కోసం ప్రపంచంతో పోరాడతాడు. తన కోరికలను త్యాగం చేసి పిల్లల శ్రేయస్సు కోసం తపనపడతాడు. అది సాధించే వరకూ విశ్రమించడు. బిడ్డల చేయి పట్టుకుని నడిపించి ప్రయోజకులుగా తీర్చి దిద్దే తండ్రి ప్రాధాన్యతను నవతరానికి తెలియజేసేందుకు చరిత్ర పుటల్లో నాన్నలకూ ఓ ప్రత్యేక రోజును కేటాయించారు. జూన్‌లో వచ్చే మూడో ఆదివారం ప్రపంచ వ్యాప్తంగా ఫాదర్స్ డే జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఫాదర్స్ డే సందర్భంగా నాన్నలపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

నడిపించే దైవం నాన్న

అనంతపురం/కల్చరల్: తండ్రి మనస్సు వెన్నలాంటిది. ఆయన కోపం వెనుక ఉండే అచంచలమైన ప్రేమ ఉంటుంది. ఆయన ఉంటే కుటుంబానికి ధైర్యం, భరోసా. బిడ్డల ఉన్నతి కోసం తాను పడ్డ కష్టాన్ని, వదులుకున్న చిన్నపాటి కోరికలను ఏనాడూ ప్రతిఫలంగా ఆశించని నిస్వార్థ వ్యక్తిత్వం నాన్నది. సహనం, ప్రేమ కలిగిన నాన్న.. బిడ్డల చెయ్యి పట్టుకుని ఉజ్వల భవితపై నడిపించే దైవంతో సమానం. అనురాగానికి, ఆప్యాయతలకు ప్రతీకగా ఉండే నాన్నతో గడిపిన క్షణాలు ప్రతి వ్యక్తి జీవితంలో మరచిపోలేని మధురానుభవాలు. పెళ్లాయి అత్తారింటికి వెళ్లిన ఆడపిల్లకు తండ్రి లాలన పట్లే మక్కువ ఎక్కువ. ఉద్యోగాలొచ్చి ఎక్కడో స్థిరపడే మగపిల్లలకు సైతం తండ్రి పంచిన క్రమశిక్షణే ముందుకు సాగేలా చేస్తుంది.

మారిన బంధం

ఒకప్పుడు ఉమ్మడి కుటుంబ వ్యవస్థ నడిచే రోజుల్లో తండ్రి అంటే అత్యంత భయభక్తులుండేవి. ఎదిరించి మాట్లాడడం కాదు కదా.. ఏదైనా కావాల్సింది అడగడానికి కూడా భయపడి తల్లి ద్వారా తమ కోర్కెలు తీర్చుకునేవారు. అయితే కాలక్రమంలో చాలా మార్పులు వచ్చాయి. ఉమ్మడి కుటుంబాలు చెదిరిపోయిన తర్వాత చిన్న కుటుంబాల్లో నాన్న ఓ స్నేహితుడిగా మారిపోయాడు. పిల్లలకు మార్గదర్శిగా ఉంటూనే తల్లి స్థానం ఆక్రమిస్తూ అన్నీ తానై నడిపిస్తున్నాడు. నాన్నంటే ఓ నీడ.. వెన్నంటి ఉండే ఓ రక్షణ వలయం అనే భావాన్ని ఈ తరం పిల్లలు వ్యక్తం చేస్తున్నారు.

చదువులు పూర్తయ్యే వరకూ ప్రోత్సహించారు



తల్లిదండ్రులతో డాక్టర్ కె.అనిత

మా నాన్న పేరు వీరన్న. కర్నూలు జిల్లా ఆదోని. మేమిద్దరమూ అమ్మాయిలం. మా నాన్న పోలీసు ఉద్యోగం చేసేవారు. అమ్మాయిలు ఆర్థికంగా, సమాజంలో గౌరవప్రదంగా ఉండాలంటే ఉన్నత చదువులు ఒక్కటే మార్గమని మా నాన్న భావించారు. ఆ దిశగానే మమ్మల్ని చదివించారు. పదో తరగతిలోనే మాకు పెళ్లి సంబంధాలు వచ్చాయి. అయినా నాన్న వాటిని తిరస్కరించి ఉన్నత చదువులు పూర్తయ్యే వరకూ మమ్మల్ని ప్రోత్సహించారు. ఆయన స్ఫూర్తితోనే ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, పీహెచ్‌డీ పూర్తి చేయగలిగాను. కొరియా, తైవాన్‌లో పోస్ట్ డాక్టరల్ ఫెలోషిప్ పూర్తి చేశాను. నా ఎదుగుదలకు కారణమైన నాన్నను ఎన్నటికీ మరువలేను.

– డాక్టర్ కె.అనిత, అసిస్టెంట్ ప్రొఫెసర్, కెమిస్ట్రీ విభాగం, ఎస్కేయూ

ఈ ఉన్నతికి కారణం నాన్నే



మాది కర్నూలు జిల్లా మారుమూల ప్రాంతమైన ఆల్వకొండ. మా నాన్న పేరు లక్ష్మన్న. కులవృత్తితో వచ్చే ఆదాయం సరిపడక కూలి పనులకు వెళ్లేవారు. సంతకు వెళితే హోటల్‌లో భోజనానికి రూ.10 కూడా ఖర్చుపెట్టకుండా డబ్బుతో మాకు అవసరమైనది కొనుగోలు చేసేవారు. తన కష్టం మా వరకు రాకూడదని తపించారు. ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ చేసి తొలుత అనంతపురంలో ఉద్యోగంలో చేరాను. అమెరికాకూ వెళ్లాను. అమెరికాలో ఉద్యోగానికి వెళ్లానని మా నాన్న గర్వంగా చెప్పుకునేవారు. ప్రస్తుతం ఎస్కేయూ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్నా. ఈ ఉన్నతికి కారణం మా నాన్నే. పదేళ్ల క్రితం ఆయన మా నుంచి శాశ్వతంగా దూరమయ్యారు.

– ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య, రిజిస్ట్రార్, ఎస్కేయూ

ఎక్కడా రాజీ పడేవారు కాదు



మాది ఉరవకొండ మండలం కొకుంట్ల గ్రామం. నాన్న పేరు ఎర్రిస్వామి. ముగ్గురం అమ్మాయిలు. ఇద్దరు అబ్బాయిల పోషణకు నాన్న పడిన కష్టం ఇప్పటికీ కళ్ల ముందు కదులుతూ ఉంది. మా చదువుల విషయంలో ఎక్కడా రాజీ పడేవారు కాదు. ఆ కష్టమే మమ్మల్ని జీవితంలో ఉన్నత స్థానానికి చేర్చింది. నాన్నను తలుచుకుంటే మాకెంతో ధైర్యంగా ఉంటుంది.

– డాక్టర్ మమత, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఈసీఈ, జేఎన్‌టీయూ (ఏ)

నాన్న లేకపోతే నేను లేను



మాది నెల్లూరు జిల్లా ఇందుకూరుపేట. నాన్న ఎ.నాగబ్రహ్మేంద్రరావు ప్రోత్సాహం లేనిదే నేను లేను. మేము మొత్తం 8 మంది సంతానం. ముగ్గురు అబ్బాయిలు, ఐదుగురు అమ్మాయిలం. వ్యవసాయాధారిత కుటుంబం. బిడ్డలందరినీ నాన్న సమానంగా చూసేవారు. ఆడపిల్లలకు చదువు ఎందుకంటూ అమ్మ గొడవ చేసేది. నాన్న వినేవారు కాదు. ఎస్కేయూలో ఎమ్మెస్సీలో సీటు వస్తే నాన్నే నన్ను వెళ్లమని ప్రోత్సహించారు. మా ఉన్నతి కోసం ఆయన చాలా త్యాగాలు చేశారు.

– ప్రొఫెసర్ కె.కృష్ణకుమారి, ప్రిన్సిపాల్, ఎస్కేయూ క్యాంపస్ కళాశాల

ప్రజల మద్దతు వైఎస్సార్‌సీపీకే

- మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి



మాట్లాడుతున్న విశ్వేశ్వరరెడ్డి

బెళుగుప్ప: ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకమై వచ్చినా రాబోవు ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకే ప్రజల మద్దతు ఉంటుందని మరోమారు జగన్ సర్కార్ ఏర్పాటు కావడం ఖాయమని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర రెడ్డి అన్నారు. బెళుగుప్ప మండలం శ్రీరంగాపురంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను పార్టీలకతీతంగా అమలు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రాష్ట్ర ప్రజలు జేజేలు పలుకుతున్నారన్నారు. ఇందుకు నిదర్శనం ఇటీవల చేపట్టిన జగనన్న సర్కార్ కార్యక్రమమన్నారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో దాదాపు కోటికి పైగా కుటుంబాలు జగన్ సర్కార్‌పై పూర్తి విశ్వాసాన్ని ప్రకటించాయన్నారు. ప్రజలకు మంచి చేశాం కాబట్టే గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంతో ప్రజల ముందుకు వెళుతున్నామన్నారు. ఏ ఇంటికి వెళ్లినా ప్రజలు స్వాగతిస్తూ మద్దతుగా నిలుస్తున్నారన్నారు. ఈ విషయం గిట్టని ప్రతిపక్ష నేతలు కావాలనే ప్రభుత్వంపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నాయని మండిపడ్డారు. టీడీపీ, జనసేన అధినేతలు రోజుకోమాట మారుస్తూ గందరగోళానికి గురి చేస్తున్నారన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీని ప్రజలు విశ్వసించడం లేదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గొప్ప మానవతావాదనేందుకు నిదర్శనంగా ప్రకృతి సహకరిస్తూ సమృద్ధిగా వర్షాలు కురుస్తున్నాయని, పాడిపంటలతో గ్రామాలు సస్యశ్యామలమయ్యాయన్నారు. సమావేశంలో ఎంపీపీ పెద్దన్న, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజినేయులు, సహకార సంఘ అధ్యక్షుడు శివలింగప్ప, నక్కలపల్లి సర్పంచ్ రామిరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ ఉపాధ్యక్షుడు పాటిల్ నాగిరెడ్డి, నాయకులు త్రిలోక్‌రెడ్డి, మారుతీరెడ్డి, రామకృష్ణారెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన బదిలీలు

అనంతపురం క్రైం: రెండ్రోజులుగా డీసీహెచ్‌ఎస్‌లో కొనసాగిన సాధారణ బదిలీల ప్రక్రియ శనివారంతో ముగిసింది. 17 మంది ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులు, ఆఫీస్ సబార్డినేట్లకు ఉభయ జిల్లాల డీసీహెచ్‌ఎస్‌లు డాక్టర్ కృష్ణవేణి, డాక్టర్ తిప్పేంద్రనాయక్ బదిలీలు నిర్వహించారు. సీనియారిటీ ప్రాతిపదికన బదిలీలు పారదర్శకంగా చేపట్టినట్లు ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

యువకుడి ఆత్మహత్య

రాయదుర్గం టౌన్: స్థానిక 28వ వార్డు పాలబావి ప్రాంతానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు ఎర్రిస్వామి(30) శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఓ భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. జబ్బు నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెందిన ఎర్రిస్వామి శనివారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

దంపతుల దుర్మరణం

- పెన్నహోబిలం సమీపంలో లారీని ఢీకొన్న ద్విచక్రవాహనం
- ఇద్దరు చిన్నారులకూ తీవ్ర గాయాలు



మృతులు నాగరాజు, స్వాతి (ఫైల్)

ఉరవకొండ: పుట్టింట శుభకార్యాన్ని చూసుకుని సంతోషంగా తిరుగు ప్రయాణమైన దంపతులు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురంలోని మారుతీనగర్‌లో నివాసముంటున్న నాగరాజు, స్వాతి దంపతులకు ఐదేళ్ల వయసున్న కుమారుడు హేమంత్, రెండేళ్ల వయసున్న కుమారుడు భానుప్రసాద్ ఉన్నారు. ఈ నెల 13న తన పుట్టినిల్లైన కణేకల్లులో నిర్వహించిన ఊరి దేవరకు భర్త, పిల్లలతో కలసి స్వాతి హాజరైంది. శనివారం ఉదయం వీరు ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమయ్యారు. ద్విచక్ర వాహనాన్ని వేగంగా నడుపుతున్న నాగరాజు.. పెన్నహోబిలం వద్ద వేగాన్ని నియంత్రించుకోలేక ఎదురుగా వస్తున్న లారీని ఢీకొన్నాడు. ఘటనలో దంపతులు, పిల్లలు చెల్లాచెదరుగా పడిపోయారు. తలకు తీవ్ర గాయం కావడంతో దంపతులిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. చిన్నారులు తీవ్రంగా గాయపడ్డారు. అటుగా వెళుతున్న వారు వెంటనే స్పందించి 108 అంబులెన్స్ ద్వారా చిన్నారులను అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ఉరవకొండ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు. కాగా, విషయం తెలుసుకున్న వెంటనే కణేకల్లు నుంచి స్వాతి కుటుంబసభ్యులు ఆగమేఘాలపై ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి చేరుకుని మృతదేహాలను చూసి బోరున విలపించారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి బధిర క్రీడాకారుల సమావేశాలు

అనంతపురం: అనంతపురంలోని అనంత సాయిబాబా కల్యాణమంటపం వేదిగా ఆది, సోమవారం రాష్ట్ర స్థాయి క్రీడా బధిరుల సమాఖ్య సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్షుడు ఎ.లక్ష్మీనరసింహ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా సాధారణ సమావేశంతో పాటు నూతన సంఘం ఎన్నికలు ఉంటాయి. ఎన్నికల పరిశీలకులుగా శాప్ ప్రతినిధులు, ఎన్నికల అధికారులుగా న్యూఢిల్లీకి చెందిన ఆల్ ఇండియా స్పోర్ట్స్ కౌన్సిల్ ఆఫ్ ది డెఫ్ ప్రతినిధులు హాజరు కానున్నారు.

ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

కుందుర్పి: జిల్లా కేంద్రానికి సమీపంలో కురుగుంట వద్ద శనివారం తెల్లవారు జామున చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో కుందుర్పి మండలం రుద్రంపల్లికి చెందిన ఇద్దరు గొర్రెల కాపర్లు తీవ్రంగా గాయపడ్డారు. కుటుంబసభ్యులు తెలిపిన మేరకు.. రుద్రంపల్లికి చెందిన రాజన్న, ప్రభాకర్ అనంతపురం మార్కెట్ యార్డులో శనివారం జరిగే గొర్రెల సంతలో జీవాలను విక్రయించేందుకు శనివారం రాత్రి బొలెరో వాహనంలో బయలుదేరారు. కురుగంట సమీపంలోకి చేరుకోగానే వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఘటనలో 8 గొర్రెలు మృతి చెందాయి. తీవ్రంగా గాయపడిన ప్రభాకర్, రాజన్నను తొలుత సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

గర్భసంచితో పాటు మూత్ర నాళం కత్తిరింపు

- రైల్వే ఆస్పత్రి వైద్యుల నిర్వాకం
- చేతులెత్తేసి కర్నూలుకు రెఫర్ చేసిన వైనం



గుంతకల్లులోని రైల్వే ఆస్పత్రి

గుంతకల్లు: కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడింది అనే చందంగా మారింది గుంతకల్లు రైల్వే ఆస్పత్రి వైద్యుల తీరు. గర్భసంచి తొలగించాలంటూ శస్త్ర చికిత్స చేపట్టిన వైద్యులు.. ఏకంగా రోగి మూత్రనాళాన్నే కత్తిరించి పరిస్థితిని మరింత జటిలం చేసిన వైనం సంచలనం రేకెత్తించింది. వివరాలు.. గుంతకల్లుకు చెందిన ఓ మహిళ రెండు రోజుల క్రితం రైల్వే ఆస్పత్రిలో చేరింది. పరీక్షించిన వైద్యులు ఆమెకు గర్భసంచి తొలగించాలని సూచించి శుక్రవారం శస్త్రచికిత్స చేశారు. అయితే గర్భసంచి తొలగించే క్రమంలో మూత్ర విసర్జన నాళాన్ని కట్ చేశారు. ఫలితంగా ఆమె పరిస్థితి విషమంగా మారింది. దీంతో చేతులెత్తేసిన వైద్యులు వెంటనే ఆమెను కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి రెఫర్ చేశారు. ఘటనపై రైల్వే ఆస్పత్రి చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ గజలక్ష్మీ ప్రభావతి వివరణ కోసం ప్రయత్నించగా ఆమె స్పందించలేదు. కాగా, గత నెల 8వ తేదీ కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకున్న పరిమళ ప్రాణాలు కోల్పోయిన ఘటన మరువకనే మరో దారుణం వెలుగు చూడడంతో రైల్వే ఆస్పత్రికి వెళ్లాలంటే ఉద్యోగులు భయపడుతున్నారు. చిన్నపాటి కుటుంబనియంత్రణ ఆపరేషన్‌ను దాదాపు 8 గంటల పాటు చేసి, చివరకు ఆమె పరిస్థితి విషమం కావడంతో వైద్యులు చేతులెత్తేశారు. దీంతో కుటుంబసభ్యులు హుటాహుటిన అనంతపురానికి తరలిస్తుండగా పరిమళ మృతి చెందింది.

పోలీసుల అదుపులో రౌడీషీటర్లు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ప్రింటింగ్ ప్రెస్ యజమాని ఆత్మహత్య కేసులో పోలీసులు పురోగతి సాధించారు. ఆత్మహత్యకు కారకులైన రౌడీ షీటర్లను అదుపులోకి తీసుకున్నారు. అనంతపురం వన్‌టౌన్ సీఐ రెడ్డెప్ప తెలిపిన మేరకు.. అనంతపురంలోని కమలానగర్‌లో తాను నివాసముంటున్న ఇంట్లోనే ప్రింటింగ్ ప్రెస్ యజమాని వంశీ (47) శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నారు. ఆత్మహత్య చేసుకునే ముందు తన చావుకు కారణాలు తెలుపుతూ సూసైడ్ నోట్ రాసి పెట్టాడు. కురుగుంట రెవెన్యూ పరిధిలో 20 ఏళ్ల క్రితం తన భార్య పేరున కొనుగోలు చేసిన భూమిని నకిలీ పత్రాలు సృష్టించి రౌడీషీటర్లు సర్దార్, బుల్లెట్ బాబా, దూదేకుల ఖాసీం కబ్జా చేయాలని ప్రయత్నించారని, ఈ విషయంగా ఫిర్యాదు చేసినా పోలీసులు, రెవెన్యూ అధికారులు స్పందించకపోవడంతో జీవితంపై విరక్తి చెందినట్టు తెలిపాడు. ఈ క్రమంలోనే ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో మానసికంగా కుదేలై ఆత్మహత్య చేసుకుంటున్నట్లుగా పేర్కొన్నాడు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు రౌడీషీటర్లు సర్దార్, ఖాసీంను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

విద్యార్థి డిబార్

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం అనుబంధ డిగ్రీ ఐదో సెమిస్టర్ రెగ్యులర్, డిగ్రీ ఆరో సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షల్లో కాపీయింగ్‌కు పాల్పడిన ఓ విద్యార్థిని డిబార్ చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ తెలిపారు. అనంతపురంలోని ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రంలో కాపీయింగ్ చేస్తూ విద్యార్థి పట్టుబడ్డాడన్నారు.

వ్యక్తికి గాయాలు

గార్లదిన్నె: మండలంలోని కల్లూరు రైల్వేస్టేషన్‌లో శనివారం రైలు నుంచి జారి పడి ఓ వ్యక్తి గాయపడ్డాడు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న 108 సిబ్బంది అక్కడకు చేరుకుని క్షతగాత్రుడిని సర్వజనాస్పత్రికి తరలించారు. పామిడి మండలం పాళ్యం గ్రామానికి చెందిన నాగరాజుగా గుర్తించారు. అనంతపురం వెళ్లడానికి రైలు ఎక్కే క్రమంలో అదుపు తప్పి కిందపడినట్లుగా తెలిసింది.

కారు ఢీ - వ్యక్తి మృతి

కళ్యాణదుర్గం రూరల్: కారు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని ఒంటిమిద్దికి చెందిన నాగప్ప (50) శనివారం రాత్రి రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళుతుండగా వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన కారు ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన నాగప్ప అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా, ఏడాది క్రితం ఆయన భార్య అనారోగ్యంతో మృతి చెందింది. ఇద్దరు కుమార్తెలుండగా వారికి వివాహం జరిగింది.

క్లుప్తంగా

లారీ ఢీకొని గొర్రెల వాహనం బోల్తా




బోల్తా పడిన బొలెరో వాహనం, ప్రమాదానికి కారణమైన లారీ

రాప్తాడురూరల్: అనంతపురంలోని మార్కెట్ యార్డ్ సంతకు గొర్రెలను తరలిస్తున్న వాహనాన్ని లారీ ఢీకొనడంతో బోల్తా పడింది. ఈప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు.. కుందుర్పి మండలం రుద్రంపల్లికి చెందిన చిన్నమల్లయ్య, దేవరాజు తదితరులు బొలెరో (లగేజీ) వాహనంలో 30 గొర్రెలను అనంతపురం మార్కెట్ యార్డ్‌లోని సంతకు తీసుకెళ్తున్నారు. కురుగుంట సమీపంలోకి రాగానే స్పీడ్‌బ్రేకర్ వద్ద వెనుకవైపున స్పీడ్‌గా వచ్చిన లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బొలెరో బోల్తా పడింది. డ్రైవర్ ప్రభాకర్, దేవరాజు, చిన్నమల్లయ్య గాయపడ్డారు. క్షతగాత్రులను వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం ప్రభాకర్, దేవరాజును కర్నూలు ఆస్పత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నీటి ట్యాంకరును ఢీ కొట్టిన కంటైనర్

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం ఇస్కాన్ టెంపుల్ వద్ద జాతీయ రహదారి డివైడర్ల మధ్య మొక్కలకు నీరు పడుతున్న ట్యాంకరును కంటైనర్ శనివారం ఢీ కొనింది. పోలీసులు తెలిపిన మేరకు..బుక్కరాయసముద్రానికి చెందిన లక్ష్మీనారాయణ ట్రాక్టర్ నీటి ట్యాంకర్‌ను ఏర్పాటు చేసుకున్నాడు. జాతీయ రహదారి డివైడర్లలో ఉండే మొక్కలకు నీరు పెట్టేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. శ్రీనివాసులుతో కలిసి ఇస్కాన్ టెంపుల్ వద్ద మొక్కలకు నీరు వదులుతున్నారు. శ్రీనివాసులు నీటిని వదులుతుండగా, లక్ష్మీనారాయణ ట్రాక్టర్‌ను నడుపుతున్నాడు. ఇదే సమయంలో బెంగళూరు వైపు నుంచి గుత్తివైపు వెళ్తున్న కంటైనర్ వాహనం వెనుకవైపు నుంచి వేగంగా వచ్చింది. విషయం గమనించి అప్రమత్తమైన కంటైనర్ డ్రైవర్.. ట్యాంకరును తప్పించినా ముందు భాగంలో ఉండే ట్రాక్టర్ ఇంజిన్ బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇంజిన్ నుజ్జునుజ్జయ్యింది. డ్రైవింగ్ సీటులో కూర్చున్న లక్ష్మీనారాయణ తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే ఆయన్ను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కర్నూలు ఆస్పత్రికి తరలించారు. రూరల్ సీఐ విజయభాస్కర్‌గౌడ్ ప్రమాదస్థలాన్ని పరిశీలించారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి

అనంతపురం అర్బన్: విద్యుత్ చార్జీలను ప్రభుత్వం తగ్గించాలని ప్రభుత్వాన్ని ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సంఘం కార్యాలయంలో విలేకరులతో ఆమె మాట్లాడారు. ఇప్పటికే నిత్యావసర సరుకుల ధరలు పెరగడంతో పేదలు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని అన్నారు. సర్దుబాటు చార్జీ పేరుతో ప్రజలపై అదనపు భారం వేయడం సరికాదన్నారు. ప్రజాశ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం స్పందించి ట్రూ అప్, సర్ చార్జీలను ఉపసంహరించాలని అన్నారు. సమావేశంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు చంద్రిక, నాయకురాల్లు కృష్ణవేణమ్మ, రామంజనమ్మ, రేణుక, మంజుల, లక్ష్మి, దేవమ్మ, కవిత, జ్యోతి, లక్ష్మీనరసమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో జెడ్పీ ఉద్యోగి మృతి



శ్రీరాములు (ఫైల్)

అనంతపురం సిటీ: స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయ రికార్డు అసిస్టెంట్ శ్రీరాములు (58) అనారోగ్యంతో శనివారం ఉదయం మరణించారు. నవోదయ కాలనీకి చెందిన శ్రీరాములు.. గుండెజబ్బుతో బాధపడుతున్నాడు. నెలరోజుల క్రితం స్టంట్ వేయించుకున్నారు. మరోసారి సమస్య తలెత్తడంతో బెంగళూరుకు తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, సైనిక సంక్షేమ శాఖ ఉమ్మడి జిల్లా అధికారి జిల్లా శ్రీనివాసులు, జెడ్పీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మర్తాడు షేక్ రఫీ సంతాపం తెలిపారు.

ఎమ్మార్పీకే ఎరువులు అమ్మాలి

గార్లదిన్నె: ఎమ్మార్పీకే ఎరువులు అమ్మాలని ఏడీఏ రవి ఎరువుల దుకాణదారులను ఆదేశించారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో శనివారం అగ్రి ఇన్‌పుట్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ డీలర్లందరూ మార్గదర్శకాల ప్రకారం దుకాణాలు నిర్వహించాలన్నారు. రైతులకు నాణ్యమైన సీడ్స్, ఫర్టిలైజర్, పెస్టిసైడ్స్ అందించాలన్నారు. ఏఓ సోమశేఖర్, డీలర్లు, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

గార్లదిన్నె: రామ్‌దాస్ పేట సమీపంలో 44వ జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అంకంపేటకు చెందిన రామచంద్రారెడ్డికి గాయాలయ్యాయి. ఐచర్ వ్యాన్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108లో అనంతపురం తరలించారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు

- రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి. చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

రాప్తాడురూరల్: వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత కులాలు, మతాలు, పార్టీలకతీతంగా అర్హత ఉన్న ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అన్నారు. శనివారం అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి కాలనీ పంచాయతీ ఆదర్శనగర్‌లో 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మ, అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటా తిరిగారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి జరిగిన లబ్ధిని తెలియజేస్తూ అందుకు సంబంధించిన లబ్ధి పత్రాలను అందించారు.

టీడీపీ హయాంలో దోచుకున్నారు..

ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు మొదలు గ్రామ స్థాయిలో ఉండే జన్మభూమి కమిటీ సభ్యుల వరకు ప్రజాధనాన్ని దోచుకున్నారన్నారు. మన అందరి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. పథకాల కోసం ఎవరికీ రూపాయి లంచం ఇవ్వాల్సిన పని లేదన్నారు. సంక్షేమ పథకాల అమలుపై అన్ని వర్గాలూ జగనన్నను కొనియాడుతున్నాయన్నారు. గతంలో ఇలాంటి ప్రభుత్వాన్ని ఎప్పుడూ చూడలేదని, ఇంటి వద్దకే పథకాలు చేరుతున్నాయని అంటున్నారని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ గుజ్జల వరలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ధనుంజయాదవ్, డాక్టర్ శీనా, మాదన్నయాదవ్, సర్పంచ్ తేజశ్విణి, పార్టీ మండల కన్వీనర్ బండి పవన్ తదితరులు ఉన్నారు.

మైనార్టీల సంక్షేమమే ధ్యేయం




మున్నానగర్, డ్రైవర్స్ కాలనీ మసీదుల్లో కరపత్రాలు విడుదల చేస్తున్న మేయర్ వసీం, ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం

- మేయర్ వసీం, ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం

అనంతపురం సిటీ: ముస్లిం, మైనార్టీల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని నగర మేయర్ వసీం, ఉర్దూ అకాడమీ రాష్ట్ర చైర్మన్ నదీమ్ అహమ్మద్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని మున్నానగర్ మసీదులో మేయర్ వసీం, డ్రైవర్స్ కాలనీ మసీదులో నిర్వహించిన 'హర్ దిల్ మే వైఎస్సార్–హమ్ సబ్ జగన్‌కే సాత్' కార్యక్రమంలో నదీం అహ్మద్ పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లా బేగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ముస్లిం మైనార్టీలకు చేసిన మేలును మేయర్ వివరించారు. ఇన్నేళ్లు టీడీపీ అధినేత చంద్రబాబు మైనార్టీలను ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకొని వదిలేశారని మండిపడ్డారు. ముస్లింలు పవిత్రంగా భావించే హజ్ యాత్రకు ప్రభుత్వపరంగా అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తున్న సీఎం జగన్‌ను ఎప్పటికీ మర్చిపోలేమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రహంతుల్లా, ఇషాక్, ఇమామ్, ముక్తి ముదస్సిరా, ఇర్షాద్, కమిటీ సభ్యులు సాదిక్, అత్తార్, అలీ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌తోనే ముస్లింమైనార్టీల స్థితిగతుల్లో మార్పు..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనంలో ముస్లిం మైనార్టీల స్థితిగతుల్లో మార్పు వచ్చిందని ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అన్నారు. ముస్లింల కోసం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఏ ముఖ్యమంత్రి కూడా ప్రవేశపెట్టలేదన్నారు. వైఎస్సార్ తరువాత జగన్ ఒక్కడే ముస్లింల కోసం పాటుపడుతున్నారన్నారు. టీడీపీ హయంలో ఒక్క ముస్లింకూ మంత్రి పదవి ఇవ్వలేకపోయిన చంద్రబాబు, ఇప్పుడు మళ్లీ బీజేపీతో పొత్తుకు పాకులాడుతున్నాడన్నారు. మరోసారి చంద్రబాబు మాటలు నమ్మి మోసపోయే పరిస్థితుల్లో ముస్లింలు లేరని స్పష్టం చేశారు. అమాయకులైన ముస్లిం యువకులపై దేశ ద్రోహం కేసులు పెట్టి హింసించిన నీచుడు చంద్రబాబు అన్నారు. కార్యక్రమంలో నాయకులు రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు జక్రియా, ముహీబ్, వేమల నదీమ్, చాంద్‌బాషా పాల్గొన్నారు.

జగన్ పాలనలోనే ముస్లింలకు న్యాయం

- వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్



మాట్లాడుతున్న వక్ఫ్‌బోర్డు చైర్మన్ రిజ్వాన్

అనంతపురం సిటీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనతోనే ముస్లింల అభ్యున్నతి, సంక్షేమం సాధ్యమైందని జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్ తెలిపారు. రాజకీయంగా ముస్లింలకు కార్పొరేటర్ స్థాయి నుంచి డిప్యూటీ సీఎం వరకు సముచిత స్థానం కల్పించారన్నారు. అనంతపురం కలెక్టరేట్ ఆవరణలోని వక్ఫ్‌బోర్డు జిల్లా కార్యాలయంలో వక్ఫ్‌బోర్డు జిల్లా సెక్రటరీ నూర్ మహమ్మద్, జాయింట్ సెక్రటరీ షేక్ ఖాజా, నాయకులు గఫార్, ఇమ్రాన్ సయ్యద్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. మసీదుల నిర్వహణ కష్టంతో కూడుకున్నదని, వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత ఇమామ్‌లు, మౌజన్లకు మంచి రోజులొచ్చాయన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మరో 200 మసీదుల్లో పనిచేసే ఇమాంలు, మౌజన్లకూ గౌరవ వేతనం వర్తింపజేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారన్నారు. వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి రావాలని కలలుగంటున్న చంద్రబాబు మళ్లీ ముస్లింల ఓట్ల కోసం తప్పుడు వాగ్దానాలు చేస్తున్నారన్నారు. వక్ఫ్‌బోర్డు తరఫున జిల్లా అంతటా తిరిగి మసీదులు, శ్మశానాల పరిస్థితిని పరిశీలిస్తామని సెక్రటరీ, జనరల్ సెక్రటరీలు షేక్ ఖాజా, నూర్ మహమ్మద్ తెలిపారు.

20 యోగా ర్యాలీ

అనంతపురం కల్చరల్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 20న నగరవీధుల్లో ర్యాలీ చేస్తున్నట్లు వివేకానంద యోగా కేంద్ర ప్రతినిధులు రాజశేఖరరెడ్డి, దివాకర్ తెలిపారు. మంగళవారం ఉదయం 7.30 గంటలకు ర్యాలీ ఆర్ట్స్ కాలేజ్ వద్ద ప్రారంభమై సప్తగిరి సర్కిల్, శ్రీకంఠం సర్కిల్ మీదుగా ప్రభుత్వ జూనియర్ కాలేజ్ వరకు సాగుతుందన్నారు. బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పోలీసు పరేడ్ మైదానంలో ఉదయం 6.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

'జగనన్న సురక్ష'ను విజయవంతం చేద్దాం



మెప్మా సిబ్బందికి సూచనలిస్తున్న కమిషనర్ రమణారెడ్డి

అనంతపురం క్రైం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ రమణారెడ్డి ఆదేశించారు. శనివారం నగరపాలక సంస్థలో అడ్మిన్, వెల్ఫేర్, ఎడ్యుకేషన్, తదితర కార్యదర్శులతో కమిషనర్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నెల 23 నుంచి ప్రతి ఇంటికీ కార్యదర్శులు, వలంటీర్లు, తదితరులు బృందాలు వెళ్లి, లబ్ధిదారుల సమస్యలు తెలుసుకోవాలన్నారు. ఏకారణంతోనైనా పథకాలు వర్తింపని పక్షంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వర్తింపజేయడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. వచ్చే నెల 1 నుంచి కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు.

రూ.35 వేలు కట్టించాలి..

జగనన్న లేఅవుట్లలో ఇంటి నిర్మాణాలు రూఫింగ్ వరకు వచ్చిన లబ్ధిదారులతో ఒక్కొక్కరితో రూ.35వేలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని మెప్మా సిబ్బందిని కమిషనర్ ఆదేశించారు. శనివారం నగరపాలక సంస్థలో మెప్మా సిబ్బంది కమిషనర్ సమావేశం నిర్వహించారు. సంఘాల్లో లేని మహిళలకు నూతన సంఘాలను ఏర్పాటు చేసి, వారు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ సావిత్రి, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్యదర్శులపై చర్యలు: వేకువజామున విధులకు హాజరుకాని పారిశుధ్య కార్యదర్శులపై చర్యలు తీసుకోవాలని కమిషనర్ రమణారెడ్డి ఎంహెచ్‌ఓ డాక్టర్ గంగాధర్ రెడ్డిని ఆదేశించారు. శనివారం 1,4, 5 సర్కిళ్లు మినహా 2,3,6 సర్కిళ్ల పరిధిలోని పారిశుధ్య కార్యదర్శులు విధులకు గైర్హాజరయ్యారు.

ముగ్గురు ఉద్యోగుల రిలీవ్: టౌన్ ప్లానింగ్ విభాగంలోని బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ మహబూబ్‌జాన్, ఇంజినీరింగ్ విభాగంలో ఏఈ సాయి, డీఈ నరసింహను కమిషనర్ రిలీవ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

కనగానపల్లి: స్థానిక సమస్యలను పరిష్కరించి, ప్రజలను సంతృప్తి పరిచేందుకు చేపట్టిన 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని డీఎల్‌డీఓ వెంకటశివారెడ్డి తెలిపారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ అలివేలమ్మ అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమంపై సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. డీఎల్‌డీఓ మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ నెల 23 నుంచి జూలై 23 వరకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు.

బాలింతల వార్డులో భద్రత కరువు



బాలింతలకు కేటాయించిన ఐడీ వార్డు షెడ్డు ఇదే



నిరుపయోగంగా ఉన్న ఐడీ వార్డు

అనంతపురం క్రైం: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని బాలింతలు, పసికందులకు ఏర్పాటు చేసిన ప్రత్యేక వార్డులో భద్రత కరువైంది. వార్డులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయలేదు. సెక్యూరిటీ సిబ్బందిని నియమించలేదు. పాత ఐడీ వార్డులో వృథాగా 38 పడకలున్నా, ఆ యూనిట్‌ను మానసిక వైద్య విభాగం, పల్మనాలజీ విభాగానికి వాడకుండా నిరుపయోగంగా ఉంచారు. ఆస్పత్రిలో ఐడీవార్డు లేదు. పల్మనాలజీ, మానసిక వైద్య విభాగాల మధ్య కోల్డ్‌వార్‌తో పాత ఐడీ వార్డును ఎవరూ వినియోగించలేదు. అందులోని 38 పడకలు వృథాగా ఉన్నాయి. గర్భిణులను అదే వార్డుకు కేటాయించి ఉంటే ఎలాంటి సమస్య ఉండేది కాదని ఆస్పత్రి వర్గాలు అంటున్నాయి. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్ మాట్లాడుతూ బాలింతలకు కేటాయించిన ప్రత్యేక వార్డులో మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఏసీలు, కెమెరాలు ఏర్పాటుకు డీఎంఈకి లిఖిత పూర్వకంగా లేఖ రాశామన్నారు. పాత ఐడీ వార్డును మానసిక వైద్య విభాగానికి ఇచ్చామన్నారు. కొన్ని రోజుల తర్వాత ఆ వార్డులోనూ బాలింతలు, గర్భిణులకు కేటాయించేందుకు కృషి చేస్తామని చెప్పారు.

'పశుబీమా'ను సద్వినియోగం చేసుకోండి

కనగానపల్లి: ప్రభుత్వం పాడి రైతులు, గొర్రెల కాపరుల కోసం అమలు చేస్తున్న వైఎస్సార్ పశుబీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యాధికారిణి రమాదేవి తెలిపారు. శనివారం మామిళ్లపల్లి గ్రామంలోని పశు వైద్యశాలలో ఆమె వివరాలు తెలిపారు. పాడి పశువులు, గొర్రెలకు ప్రమాద బీమాను వర్తింపజేసేందుకు ప్రభుత్వం వైఎస్సార్ పశుబీమా పథకాన్ని అమలు చేస్తోందన్నారు. పాడి పశువులు ఉన్న రైతులు రూ.30 వేల బీమా కోసం రూ.960, రూ.15 వేల బీమా కోసం రూ.480 ప్రీమియం చెల్లించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఆర్థికంగా వెనుకబడిన వారికి 60 శాతం పైగా రాయితీ ఉంటుందన్నారు. ఈ బీమా కాల వ్యవధి మూడేళ్ల వరకు ఉంటుందన్నారు. గొర్రెలు, మేకల కోసం చేసే రూ. 6 వేల బీమా కోసం ఏడాదికి రూ.90, రెండేళ్లకు రూ. 135, మూడేళ్లకు రూ.188 ప్రీమియం చెల్లించాలన్నారు. ఎస్సీ, ఎస్టీలు, ఆర్థికంగా వెనుకబడిన వారికి రాయితీ ఉంటుందన్నారు.

కుష్టు నిర్మూలనకు కృషి చేయాలి

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ వీరబ్బాయి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ వీరబ్బాయి

అనంతపురం క్రైం: కుష్టు నిర్మూలనకు కృషి చేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ వీరబ్బాయి తెలిపారు. శనివారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో కుష్టు వ్యాధి నిర్మూలనపై అధికారులతో సమావేశం నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ రోజూ 20 నుంచి 35 ఇళ్లను కుష్టు వ్యాధి సర్వే వలంటీర్లు, ఆశావర్కర్లు సందర్శించాలని, కుష్టు లక్షణాలుంటే గుర్తించి పీహెచ్‌సీల్లో వైద్య పరీక్షలు చేయించేలా చూడాలన్నారు. వ్యాధి నిర్ధారణ అయితే పట్టణ ఆరోగ్య కేంద్రాలకు పంపి, వైద్యం అందించాలన్నారు. కుష్టు వ్యాధితో అంగవైకల్యానికి గురైన వారికి పలమనేరులోని ఎమ్మాస్ ఆస్పత్రిలో మెరుగైన చికిత్స అందిస్తారన్నారు. ఆపరేషన్ తర్వాత ఒక్కొక్కరికి రూ.12 వేలు వారి బ్యాంకు ఖాతాలో జమ చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ సుజాత, ఎన్‌హెచ్‌ఎం నోడల్ ఆఫీసర్ డాక్టర్ చెన్నకేశవులు, డాక్టర్ అనుపమ జేమ్స్, డాక్టర్ కృష్ణవేణి, జిల్లా పంచాయతీరాత్ అధికారులు పాల్గొన్నారు.

20న బీజేపీ బహిరంగ సభ

అనంతపురం టవర్‌క్లాక్: ప్రధాని మోదీ పాలన తొమ్మిదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నగరంలో ఈనెల 20న బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా సభ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. సభకు మాజీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ చంద్రశేఖర్ పాల్గొంటారన్నారు.

కిడ్నీ బాధితుడికి 'అమ్మ' ఆపన్నహస్తం



ఆర్థిక సాయం అందిస్తున్న తరిమెల రమణారెడ్డి

అనంతపురం కల్చరల్: కిడ్నీ బాధితుడికి 'అమ్మ' స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి ఆపన్నహస్తం అందించారు. పుట్టపర్తి మండలం వెంగళమ్మచెరువుకు చెందిన కొండన్న, గంగాదేవి దంతపతుల కుమారుడు రమేష్ బెంగళూరులో ఎంబీఏ చివరి సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల తరుచూ అనారోగ్యానికి గురవుతుంటే ఆస్పత్రిలో చూపిస్తే రెండు కిడ్నీలూ చెడిపోయాయని వైద్యులు తేల్చి చెప్పారు. పరిస్థితి విషమించడంతో తండ్రి కొడుకుకు కిడ్నీ ఇవ్వడానికి ముందుకు వచ్చాడు. కానీ వైద్య ఖర్చులకు కూడా లేక ఇబ్బందులు పడుతుండగా, అమ్మ సంస్థ నిర్వాహకుడు తరిమెల రమణారెడ్డి స్పందించారు. శనివారం వారి కుటుంబానికి రూ.30 వేలు సాయం అందించి, భవిష్యత్తులో వైద్య ఖర్చులు తానే భరిస్తానని భరోసా ఇచ్చారు.

ఎస్కేయూలో సూపరింటెండెంట్ సస్పెన్షన్

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని పరీక్షల విభాగంలో విధులు నిర్వహిస్తున్న సుధారాణిని సస్పెండ్ చేశారు. ఎస్కేయూ వీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య ఉత్తర్వులు జారీ చేశారు. సక్రమంగా విధులకు హాజరు కాకపోవడంతో ఇటీవల షోకాజ్ నోటీస్ జారీ చేశారు. లిఖిత పూర్వకంగా ఇచ్చిన వివరణ సంతృప్తికరంగా లేకపోవడంతో చర్యలు తీసుకున్నారు. అధికారిక సమావేశానికి హాజరు కావాలని ఉన్నతాధికారులు ఆదేశించినా బేఖాతరు చేయడంతో ఉన్నతాధికారులు షోకాజ్ నోటీసును గతంలో జారీ చేశారు.

బాధ్యతాయుతంగా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ గంగావతి

చెన్నేకొత్తపల్లి: సచివాలయ ఉద్యోగులు బాధ్యతాయుతంగా పని చేయాలని ఎంపీడీఓ గంగావతి ఆదేశించారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులతో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందించే బాధ్యత సచివాలయ ఉద్యోగులదే అన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ అనూరాధ, జెడ్పీటీసీ గోవింద రెడ్డి, ఎంపీపీ అంజలి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బియ్యం పట్టివేత

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: అక్రమంగా పేదల బియ్యాన్ని తరలిస్తున్న ఐచర్ వాహనాన్ని నాల్గో పట్టణ పోలీసులు సీజ్ చేశారు. శనివారం స్థానిక రుద్రంపేట కూడలిలో వాహనాలు తనిఖీ చేస్తుండగా, 280 బ్యాగుల బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నారు. బియ్యాన్ని తరలిస్తున్న బుక్కరాయసముద్రం, జన చైతన్యకాలనీ టిప్పుసుల్తాన్, శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం లక్ష్మీ చెన్నకేశవ పురానికి చెందిన రామ్మోహన్‌ను అరెస్ట్ చేశారు. వారి నుంచి 280 బ్యాగులు బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

జీవాలకు నట్టల నివారణ మందులు



నట్టల నివారణ మందు అందిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: మండలంలోని జీవాలకు నట్టల నివారణ మందులు వేస్తున్నట్లు పశువైద్యాధికారి తులసీరామ్ తెలిపారు. శనివారం మండలంలోని సిద్దరాంపురంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాలపోతన్న చేతుల మీదుగా కార్యక్రమం ప్రారంభించారు. పశువైద్యాధికారి మాట్లాడుతూ ప్రతి ఆరు నెలలకోసారి కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ నెల 30 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. జీవాలకు తప్పనిసరిగా నట్టల నివారణ మందు తాపించాలన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

గార్లదిన్నె: పెనకచెర్లకు చెందిన ఓ వ్యక్తి శుక్రవారం అర్ధరాత్రి ఆత్మహతకు యతి్నంచాడు. 108 సిబ్బంది తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన చిన్న ఓబులేసు ఇంటి వద్ద పురుగు మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని కుటుంబ సభ్యులు 108లో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఎన్‌సీసీతో క్రమశిక్షణ

పామిడి: ఎస్‌సీసీతో క్రమశిక్షణ అలవడుతుందని ఎన్‌సీసీ యూనిట్ కల్నల్ సందీప్ ముంద్రా అన్నారు. శనివారం స్థానిక టీసీహైస్కూల్‌లో ఎన్‌సీసీ యూనిట్ ప్రారంభోత్సవానికి కల్నల్‌తో పాటు సుబేదార్ సుఖ్‌దేవ్‌సింగ్ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మున్వర్‌బాషా, ఎన్‌సీసీ యూనిట్ అధికారి వై రామాంజనేయులు, పేరెంట్స్ కమిటీ చైర్‌పర్సన్ నాగమణి, మాజీ సైనికోద్యోగులు లక్ష్మీనారాయణ, నాగేశ్వరరావు, నవీన్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రామస్వామిగుడి ట్రస్ట్‌బోర్డు ఏర్పాటుకు నోటిఫికేషన్

గుంతకల్లుటౌన్: పట్టణ నడిబొడ్డున గల అతిపురాతనమైన కోదండరామస్వామి ఆలయ ధర్మకర్త మండలిని నియామకానికి దేవదాయశాఖ నోటిఫికేషన్ జారీ చేసినట్లు శనివారం ఆలయ ఈఓ మతం మల్లికార్జున ఓ ప్రకటనలో తెలిపారు. ధర్మకర్తలుగా ఆసక్తి కలిగిన వారు జూలై 1లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తుతో పాటు కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, రెండు ఫొటోలను జతపరిచి దరఖాస్తులను జిల్లా దేవదాయశాఖ అధికారికి పంపాలని, వివరాలకు 9440699921 నంబరులో సంప్రదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

వృద్ధురాలికి తీవ్రగాయాలు

పామిడి: స్థానిక కరెంటు ఆఫీసు వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు గాయపడింది. వివరాలు..సాయంత్రం కరెంటు ఆఫీసు వద్దనున్న చికెన్‌సెంటర్ వద్ద కోళ్లు అన్‌లోడ్ చేయడానికి వ్యాన్ వచ్చింది. ఈక్రమంలో చెత్త పారేయడానికి వచ్చిన బెస్త లక్ష్మీదేవిని వెనుక నుంచి ఢీకొంది. ప్రమాదంలో ఆమె కుడిచేయి నుజ్జునుజ్జయింది. వెంటనే ఆమెను అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పామిడి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.